క్లుప్తంగా

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

టి.నరసాపురం : యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్సై కె.సతీష్ కుమార్ హితవు పలికారు. టి.నరసాపురం, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేస్తే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. అటువంటి వారి గురించి వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు తెలిపారు. మాదకద్రవ్యాలు, చెడువ్యసనాలతో భవిష్యత్తు నాశనమౌతుందని, కావున వాటికిదూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.లింగస్వామి, ఆలీ, ఉపాధ్యాయులు ఆర్‌వీజీ కృష్ణారావు, కె.కుటుంబరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11.30 గంటల నుంచి కౌన్సిల్ సమావేశం జరుగుతుందని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని అశ్వారావుపేట రోడ్‌లో వేంచేసిఉన్న సుప్రసిద్ధ శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సాయిస్ఫూర్తి హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు దుట్ట శ్రావణ్ చందర్, అమృత దంపతులు, కుమార్తె ఆద్య, తల్లి విష్ణుప్రియల ద్రవ్యసహకరణతో అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటర్ల సమగ్ర సర్వేపై సమావేశం

పోలవరం రూరల్ : ఓటర్ల సమగ్ర సర్వేలో లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని బీఎల్‌వోలకు సూచించినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వేచేసి చనిపోయిన వారి ఓట్లను తొలగించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేయడం జరుగుతుందన్నారు. బీఎల్‌వోలతో పాటు సర్వేలో గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు కూడా పరిశీలించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

చింతలపూడి : మండలంలోని పట్టాయిగూడెం ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాల విద్యార్థులకు మంగళవారం డీపర్‌లైఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందచేశారు. సంస్థ కన్వీనర్ కె బుచ్చిబాబు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక పాఠశాలలకు విద్యాసామగ్రిని అందచేసినట్లు తెలిపారు. పట్టాయిగూడెం పాఠశాల విద్యార్థులకు రూ. 5 వేల విలువైన నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రిని అందచేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్రావు, పీసీ కమిటీ చైర్మన్ రాఘవ, హెచ్‌ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి

ద్వారకాతిరుమల : ప్రతి ఒక్క విద్యార్థిని రక్షణ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ద్వారకాతిరుమల సచివాలయం మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజన అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సుజన బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మికుల నిషేధ, నియంత్రణ చట్టం, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాలను వివరించారు. మహిళలు, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పి.విజయ భారతి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది రాణి, రమాదేవి, మల్లీశ్వరి, మహాలక్ష్మి తదితరులున్నారు.

ఎర్రకాలువలోకి వరద నీరు

జంగారెడ్డిగూడెం రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి మంగళవారం గంటకు 642 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. పూర్తి నీటి సామర్థ్యం 83.50 మీటర్ల కాగా ప్రస్తుతం 79.40 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయని ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు.

ప్రతిపాదనలు తయారు చేయండి

పోలవరం రూరల్ : గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ముందుగా పంచాయతీల్లో చర్చించుకుని ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన ఎంపీడీవో జి.శ్రీనుతో కలిసి మంగళవారం మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయితే సచివాలయానికి రూ. 40 లక్షలు నిధులు మంజూరవుతాయని, ఆ నిధులతో ఏయే పనులు చేపట్టాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



జంగారెడ్డిగూడెం : లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



చింతలపూడి : నామవరంలో సర్టిఫికెట్లు అందచేస్తున్న ఎంపీడీఓ మురళీకృష్ణ



లింగపాలెం : శింగగూడెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొయ్యలగూడెం : సరిపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్షలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : నూరుశాతం సంక్షేమ పథకాలు అందించి పేదలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో 9వ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక కారణాలు, ఇతరత్రా కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందనివారికి కూడా పథకాలు అందించాలనే ఉద్దేశంతో ఇంటింటి సర్వే నిర్వహించి పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు డేటా చౌర్యం చేస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులైన వారికి పథకాలు అందించడం కోసమే వలంటీర్లు వివరాలు సేకరిస్తున్నారని, అది డేటా చౌర్యం ఎలా అవుతుందని ఎమ్మెల్యే ఎలీజా ప్రశ్నించారు. కార్యక్రమంలో 1180 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షులు వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్ అధ్యక్షుడు పదమటి గిరిబాబు గౌడ్, పట్టణ సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. జగనన్న సురక్ష

చింతలపూడి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరం అని ఎంపీడీఓ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని నామవరం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి రుసుము లేకుండా 11 రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ జరబలా వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే షకీలున్నీసా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

లింగపాలెం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు అన్నారు. మంగళవారం శింగగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటగిరి హరీష్, కోటగిరి ధీరాజ్‌కృష్ణ, శావా రాజేష్, కొప్పుల వెంకటేశ్వరరావు, పి సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధర్‌బాబు, తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో జగనన్న సురక్ష

కొయ్యలగూడెం : సరిపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అదేవిధంగా ఐసీడీఎస్ శాఖతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీటీసీ బండి గంగారత్నం, సర్పంచ్ తాడేపల్లి గోపి, వీఆర్‌వో అడపా రాంబాబు, బండి కోటేశ్వరరావు, దూలపల్లి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ సంక్షేమం



ద్వారకాతిరుమల : గుణ్ణంపల్లిలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల : జగనన్న సురక్ష కార్యక్రమాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని గుణ్ణంపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్బీకే వద్ద దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం రెండు సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాన్ని, అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సురక్ష సభలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే తలారి కలం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో పాటు, రేషన్, కౌలు కార్డులను అందజేశారు. విలేజ్ హెల్త్ సెంటర్ భవన స్థల దాత బొల్లారెడ్డి భాస్కరరెడ్డిని ఎమ్మెల్యే తలారి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయి కృష్ణ, బొండాడ వెంకన్నబాబు, సర్పంచ్ తానిగడప సుజాత, ఎంపీటీసీ మనెల్లి మణి, జంగా వెంకట కృష్ణారెడ్డి, ముల్లంగి నీలకంఠేశ్వరరెడ్డి, ముల్లంగి వెంకటరామిరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



విలేకర్లతో మాట్లాడుతున్న గొమ్ముగూడెం గ్రామస్తులు

కుక్కునూరు : వరదను కూడా రాజకీయం చేస్తున్న టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు హితవు పలికారు. మంగళవారం రావికుంట పునరావాస కేంద్రంలో బాధితులకు కూరగాయలు పంపిణీ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రామానికి చెందిన రెండుకుటుంబాల వారు వారి ఇళ్లల్లో సామాన్లు ఎక్కువగా ఉండడంతో ఒక్కసారిగా వరద పెరిగితే తరలించడం కష్టమవుతుందని వారి సొంతంగా ముందుగానే ట్రాక్టర్లను తెప్పించుకొని సామాన్లను తరలించుకున్నారని గ్రామస్తులు తనతో చెప్పినట్టు వివరించారు. అంతేకాని అధికారులు తరలించినందుకు ఎటువంటి డబ్బులు వసూలు చేయలేదని గ్రామస్తులు తెలిపారన్నారు. అధికారులు బాధితులందరిని తరలించిన తరువాత ప్రభుత్వంపై బురదజల్లేందుకు పక్కాప్రణాళికతో టీడీపీ నాయకులు తమ పార్టీల వారికి ఫోన్ చేసి 8 ట్రాక్టర్లను తీసుకెళ్లి పదినిముషాలలో వచ్చేసి తామేదో సేవా తత్పరులుగా ప్రచారం చేసుకున్న టీడీపీ నాయకుల కుయుక్తులను గ్రామస్తులు బహిరంగంగానే విమర్శించారని ఎద్దేవా చేశారు. ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవాలి గాని దాన్ని కూడా రాజకీయంగా ప్రచారం చేసుకోవడానికి వాడుకోకూడదన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు పరిణితిగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, రావు వినోద్, కుచ్చర్లపాటి నరసింహరాజు, చిన్న నరసింహరాజు, చంటినాయుడు, రాము, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయల పంపిణీ



రాయికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వరద బాధితులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుక్కునూరు : గోదావరి వరదతో గ్రామాన్ని ఖాళీ చేసి రాయికుంట పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న గొమ్ముగూడెం గ్రామస్తులకు మంగళవారం కుక్కునూరు వైఎస్సార్ సీపీ నాయకులు కూరగాయలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు మాట్లాడుతూ పార్టీ తరుపున బాధితులకు ఎటువంటి అవసరం వచ్చినా సాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని చెప్పారు. వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం రాకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని బాధితులకు ధైర్యం చెప్పారు. అందుకే ముందస్తుగా మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేశారన్నారు. రాబోవు రోజుల్లో నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, ఎంపీటీసీ సోడే సాధు, నాయకులు రావు వినోద్, కుచ్చర్లపాటి చిన్న నరసింహరాజు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, దేవర సత్యనారాయణ, గుమ్మల అచ్చయ్య, సాంబయ్య, మల్లెల చంటినాయుడు, సూర్ల రాము, మనోజ్, కుక్కునూరు ప్రసాద్, పిల్లి నాగేంద్ర, కోమళ్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శంకరరావు

టి.నరసాపురం : అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డీఎస్‌బీ శంకరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన టి.నరసింహస్వామి రిటైర్డ్ కావడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా శంకరరావు బదిలీపై వచ్చారు.

బాధితుల ఖాతాలో నష్టపరిహారం జమ

కుక్కునూరు : గత సంవత్సరం జూలై నెలలో వచ్చిన గోదావరి వరద కారణంగా ఇళ్లు కూలి నిరాశ్రయులైన బాధిత కుటుంబాల ఖాతాలలో మంగళవారం నష్టపరిహారాన్ని అధికారులు జమచేశారు. గతంలో కొందరికి నష్టపరిహారం అందినప్పటికి మరికొందరికి జమ కాలేదు. దీంతో ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చేశారు. దీంతో బాధితుల ఖాతాలలో నష్టపరిహారం జమైంది. కాగా ఇంకా జమకాని వారెవ్వరైనా ఉంటే వారికి కూడా ఒకటి, రెండు రోజుల్లో జమచేస్తారని అధికారులు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కొయ్యలగూడెం : విద్యుత్ సంస్కరణ పేరిట కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న కరెంటు చార్జీలు ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టదలుచుకున్న ప్రభుత్వం ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కొయ్యలగూడెం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశం అంటుతున్నాయని దీనికి తోడు విద్యుత్ బిల్లు కూడా షాక్ కొడుతుందన్నారు. ప్రజా వ్యతిరేకతను గమనించి పెంచిన కరెంటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు ధరలను రద్దు చేయాలని లేనియెడల 2024 ఎన్నికలలో ఓటు తీర్పుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ మరిడియ, ఎస్.శివకుమార్, కె.సీతారాముడు, సీహెచ్ సత్యనారాయణ, జి.గోపి, పి.తమ్మారావు, ఎస్‌కే బాబ్జి పాల్గొన్నారు.

జోరు వానలో.. వరినాట్లు



వర్షంలో నాట్లు వేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం మండలం కృష్ణాపురం సమీపంలో పొలంలో దమ్ము చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మన్యంలో చెరువులు, కాలువల్లోకి పుష్కలంగా నీరు చేరింది. సాగుకు అనుకూల పరిస్థితులు ఉండటంతో గత వారం రోజుల నుంచి గిరిజన ప్రాంతంలో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు. మంగళవారం జోరున వర్షం కురుస్తునప్పటికి బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి, ఇప్పలపాడు, సూరపవారిగూడెం గ్రామాల సమీపంలో ఉన్న పొలాల్లో వరినాట్లు పనులు చేస్తూ కూలీలు బిజీబిజీగా కనిపించారు. కాగా ఈ ఖరీఫ్ సీజన్‌లో డివిజన్ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలో 54,441 హెక్టారుల్లో వివిధ పంటలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకూ వరి 3,256 హెక్టార్లు, ప్రత్తి 3,323 హెక్టార్లు, మొక్కజొన్న 30 హెక్టార్లు, వేరుశనగ 10 హెక్టార్లు, బొబ్బర్లు 8 హెక్టార్లు, చెరకు 268 హెక్టార్లు, కందులు 25 హెక్టార్లు, తదితర పంటలను ఇప్పటివరకూ రైతులు వేసినట్లు చెప్పారు.

మిగులు భూములు పేదలకు పంచాలి



జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శేఖర్

జంగారెడ్డిగూడెం : మిగులు భూములు పేదలకు పంచాలని, ఉపాధి చూపాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ స్థానిక ఆలపాటి గంగా భవానీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ మహాసభకు బత్తుల వెంకటేశ్వరరావు, మడివి కామయ్య, తాళ్లూరి రత్నం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జెండాను సంఘం గౌరవాధ్యక్షులు బోడా వజ్రం ఆవిష్కరించారు. ఈ మహా సభలో ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలకు కల్పించబడ్డ హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం : మండలంలోని కేతవరం గ్రామంలో పేకాటపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.7650 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

ఒక వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై కేతవరం గ్రామానికి చెందిన పాట్ల శ్రీను అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు.

మణిపూర్ ఘటనపై ప్రధాని స్పందించాలి



కొయ్యలగూడెంలో మణిపూర్ ఘటనపై ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు



జంగారెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం : మణిపూర్ ఘటన విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించాలని, కేంద్ర ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడి, మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాద హింసలను నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో అల్లర్లను ఆపాలని కోరుతూ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీలను నడిరోడ్డుపై బట్టలు లేకుండా ఊరేగించి వారిని చంపుతుంటే దేశ ప్రధాని నరేంద్ర మోడీ చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. మణిపూర్ విధ్వంసాలకు కారణమైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, చింతలపుడి దుర్గారావు, కట్ట మహాలక్ష్మయ్య, మద్దల దుర్గారావు, ధగాని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి

జంగారెడ్డిగూడెం : మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని తక్షణం రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెంలో సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భగత్ సింగ్ సెంటర్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవకృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

కుక్కునూరు : మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ మంగళవారం కుక్కునూరులో సీపీఐ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి భయభ్రాంతులకు గురిచేసి హింసను సృష్టిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లర్లకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తక్షణం రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మడిపల్లి రమణయ్య, గాడిద వెంకటరమణ, పల్లెల రమణ, పల్లెల ఈశ్వరమ్మ, వేములపల్లి సుజాత, వేములపల్లి స్వాతి, నవీన్,ప్రసాద్, వెంకటలక్ష్మి, కె.తిరుపతమ్మ, లక్ష్మి, రవణమ్మ పాల్గొన్నారు

బాధితుడికి ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం : గవరవరానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్‌కి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం వసుధ ఫౌండేషన్ రూ.20వేలు అందజేసింది. గతేడాది డిసెంబర్ 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం మరోసారి ఆపరేషన్ చేయించాలని ఇందుకు రూ.3 లక్షల వరకు వైద్య ఖర్చులకు అవసరమవుతుందని, దాతలు ఆర్థిక సహాయం అందిస్తే ఆపరేషన్ పూర్తవుతోందని కుటుంబ సభ్యులు అర్థిస్తున్నారు. శ్రీనివాస్‌కు తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి పండు, చోడే ఫణి, చంద్రశేఖర్ కొండేపాటి, రామకృష్ణ, చిటికిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

జంగారెడ్డిగూడెం : దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని ఇప్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఇప్టూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాలను, పథకాలను ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని, వాటిని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యాచారాలు, గృహ దహనాలు, ఆస్తులు ధ్వంసం చేసినవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు ప్రభుత్వాలు అండగా నిలబడి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇప్టూ నాయకులు తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, గంపల వెంకటేష్, ముప్పిడి గంగారం, దొండపాటి వెంకటేష్, పాడిదోలు దుర్గారావు పాల్గొన్నారు.